మార్కెట్ వ్యవస్థలో ప్రణాళికలు-ప్రభుత్వ పాత్ర

మార్కెట్ వ్యవస్థలో పోటీతత్వ ప్రోత్సాహం వల్ల సామర్థ్యం, ఉత్పాదకత పెరుగుతుంది. ఏకస్వామ్యాలు, విద్య, ఆరోగ్యంలాంటి పబ్లిక్ వస్తువుల విషయంలో మార్కెట్ వైఫల్యం స్పష్టమవుతున్నందున వీటి విషయంలో ప్రభుత్వ జోక్యం అవసరం. పారిశ్రామికీకరణ ప్రభుత్వ జోక్యం ద్వారానే సాధ్యమైందని నూతనంగా పారిశ్రామికీకరణ చెందిన దేశాలు భావిస్తున్నాయి.

మార్కెట్ ఆధారిత వనరుల పంపిణీ దిశగా తనవంతు పాత్రను నిర్వహించడంలో భారతదేశంలో ప్రణాళికా సంఘం విఫలమైంది. ప్రజల జీవన ప్రమాణాలు ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రైవేటీకరణ. 1990లో రష్యా, తూర్పు యూరోప్ దేశాల్లో సామ్యవాద వ్యవస్థ పతనం, కమ్యూనిస్టు చైనా చేపట్టిన మార్కెట్ సామ్యవాదం ప్రైవేటీకరణ వాదానికి బలం చేకూర్చింది. మార్కెట్ ఆర్థికవ్యవస్థలో కూడా ప్రభుత్వ పెట్టుబడికి సంబంధించి మధ్య, దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. సరళీకృత విధానాల నేపథ్యంలో మన దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల్లో మార్కెటీకరణ ఒక ప్రధాన అంశం. సరళీకృత ఆర్థిక విధానాలు మన ఆర్థిక వ్యవస్థను 'మార్కెట్ ఆధారిత వ్యవస్థ'గా రూపొందించడంలో సఫలమయ్యాయి. ఉత్పత్తి, ఆధునికీకరణ, పంపిణీలకు సంబంధించి ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా తొలగి, ప్రధాన నిర్ణయాల విషయంలో మార్కెట్ శక్తుల పాత్ర పెరిగింది. పోటీతత్వం పెరగడం వల్ల సామర్థ్యం, ఉత్పాదకత పెరుగుతుంది. తదనుగుణంగా ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక నుంచి రూపొందించిన మార్కెట్ ప్రణాళికల్లో భాగంగా ప్రభుత్వ రంగ పాత్రను కుదించారు. కానీ పంచవర్ష ప్రణాళికల నేపథ్యంలో ఆర్థికాభివృద్ధిలో భాగంగా ప్రోత్సహించిన ప్రధాన రంగాల్లో మార్కెట్ వైఫల్యం స్పష్టంగా కనిపించింది. సూచనాత్మక ప్రణాళికలో అభిలషణీయమైన పాత్ర పోషించడంలో ప్రణాళికా సంఘం విఫలమైంది. ప్రణాళికల లక్ష్యం 'సామ్యవాద రీతి సమాజ స్థాపన' నుంచి Inclusive development కోసం ప్రణాళిక వైపు మరలింది. భారతదేశం లాంటి మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రణాళిక అమలు సాహసంతో కూడుకున్నది. ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగానికి ప్రధాన పాత్ర ఉన్నపుడు భౌతిక, ఫైనాన్స్ లాంటి అంశాలపై నియంత్రణను సమర్థంగా అమలు చేయడం పెద్ద సవాలు.

మార్కెట్ ప్రణాళికల్లో ప్రభుత్వ పాత్ర

స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం బహుముఖ పాత్ర నిర్వహించాలి. ఒకవైపు కొన్ని వస్తు సేవలను ప్రత్యక్షంగా అందించడం ద్వారా.. మరోవైపు ప్రైవేటు రంగం సమర్థంగా పని చేసేవిధంగా ఆ రంగాన్ని తీర్చిదిద్దాలి. మార్కెట్ వ్యవస్థలో వివిధ దేశాల మధ్య ప్రభుత్వ పాత్ర విషయంలో అనేక కారకాలకు సంబంధించిన తేడాలున్నప్పటికీ మొత్తంగా ప్రభుత్వం నిర్వహించాల్సిన విధి ప్రభుత్వ యంత్రాంగం పరిపాలనా సామర్థ్యం, ప్రస్తుత ప్రైవేటు రంగ అభివృద్ధి అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. మార్కెట్ వ్యవస్థలో ఆర్థికాభివృద్ధిని ప్రధానంగా ప్రభావితం చేసే మానవ మూలధనంపై ప్రభుత్వ రంగ పెట్టుబడులు తప్పనిసరి. 1980, 1990 దశకంలో తూర్పు, దక్షిణ-తూర్పు ఆసియా దేశాల్లో ఎగుమతుల వృద్ధి ద్వారా అధిక వృద్ధి సాధ్యమైంది. వాణిజ్యంలో ప్రైవేటు రంగ పాత్ర గణనీయమైనప్పటికీ ప్రభుత్వ మద్దతు కూడా చాలా ముఖ్యం. ఈ విషయంలో రిపబ్లిక్ ఆఫ్ కొరియా అనుభవం చెప్పుకోదగ్గది. Exportled growth జరిగే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ఆ దేశం ఆర్థికాభివృద్ధివైపు పయనించింది. మరోవైపు బంగ్లాదేశ్, కాంబోడియాలు నిరపేక్ష పేదరిక నిర్మూలనలో మంచి ప్రగతి సాధించే విధంగా ప్రణాళికలు రూపొందించుకొని సఫలీకృతమయ్యాయి. థాయ్‌లాండ్ చాలా ఏళ్లుగా అధిక వృద్ధిరేటు నమోదు చేసుకుంటున్నప్పటికీ పేదరిక నిర్మూలనలో అంత ప్రగతి కనపరచలేకపోయింది. దీనిని గుర్తించిన విధాన నిర్ణేతలు 8వ ప్రణాళిక (1997-2001) నుంచి ఆ దేశంలో పేదరిక నిర్మూలనను ప్రణాళికా ప్రక్రియలో ముఖ్యఅంశంగా గుర్తించి ప్రభుత్వ రంగ పెట్టుబడులను ఆ దిశగా పెంచారు. బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ అనుభవాలు పేదరిక నిర్మూలనకు సంబంధించి వారి ప్రణాళికా బద్ధమైన ప్రక్రియ అన్ని మార్కెట్ ఆధారిత వ్యవస్థలు గమనించదగినవి. కాంబోడియా పేదరిక నిర్మూలనపై దృష్టి కేంద్రీకరించింది. మార్కెట్ సామ్యవాదం అవసరాలకు అనుగుణంగా దృష్టి కేంద్రీకరించడానికి చైనా ప్రణాళికా సంఘం పాత్ర మార్చి దానిని 1998లో 'జాతీయ అభివృద్ధి-సంస్కరణల కమిషన్'గా పేరు మార్చింది. సంస్కరణల ప్రక్రియను వేగవంతం చేసి ECONOMIC TRANSFORMATIONలో మార్కెట్ మంచి పాత్ర పోషించేవిధంగా తీర్చిదిద్దడం ఈ కమిషన్ విధి.

మార్కెట్ ప్రణాళికలు - భారత్ అనుభవాలు

1951 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన పంచవర్ష ప్రణాళికలను రూపొందించిన విధానం సమర్థంగా లేదు. భౌతిక, ఫైనాన్స్ అంశాలపై సరైన నియం త్రణ విధానం లేనట్లు స్పష్టంగా తెలుస్తోంది. అనేక అభివృద్ధి ప్రాజెక్టుల ఎంపికలో వ్యయ-లాభ విశ్లేషణ కన్నా రాజకీయ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించారు. 1991

జూలైలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వృద్ధిరేటు పెంచడం, సంపూర్ణ ఉద్యోగిత సాధించడానికి ఉపాధి విస్తరణ, పేదరిక రేఖ దిగువ జనాభాను తగ్గించడం, ఆదాయ అసమానతలు తగ్గించడం, ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి ధ్యేయంగా నూతన ఆర్థిక విధానాలు రూపొందించింది. ఈ నేపథ్యంలో ప్రారంభమైన ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వరంగ పాత్ర కుదిస్తూ, ప్రైవేటు రంగానికి అనేక అంశాలలో ప్రాధాన్యమిస్తూ ప్రణాళికా సంఘం కొన్ని చర్యలు తీసుకుంది. దేశంలో ఉత్పాదక సంస్కృతి పెంపొందించే దిశలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలని, గ్రామీణ మౌలిక సౌకర్యాల కల్పనకే ప్రభుత్వాన్ని పరిమితం చేస్తూ.. దేశ ఆర్థికాభివృద్ధి సాధనలో ప్రైవేటు రంగం భాగస్వామ్యం పెంచేవిధంగా ఆ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రణాళికా సంఘం భావించింది. తదనుగుణంగా 9వ, 10వ ప్రణాళికలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై ప్రభుత్వరంగ పెట్టుబడులు తగ్గించింది. మరోవైపు మౌలిక సౌకర్యాలపై ప్రైవేటురంగ పెట్టుబడులు ఆశించిన స్థాయిలో సమకూరనందువల్ల ఆర్థికాభివృద్ధి ప్రోత్సహించే విధంగా ఈ రంగాలను అభివృద్ధిపరచడంలో మార్కెట్ శక్తులు విఫలమయ్యాయని చెప్పవచ్చు. అనేక అధునాతన ప్రణాళికల నమూనా ద్వారా వివిధ రంగాలలో ఉత్పత్తి లక్ష్యాలలో స్థిరత్వం సాధించడానికి ప్రణాళికా సంఘం పెట్టుబడి ప్రణాళికను ఎంచుకొంది. ఒకవైపు ఆర్థిక వ్యవస్థపై తక్కువ నియంత్రణ, మరోవైపు ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటురంగ పెట్టుబడులు అర్థరహితంగా ఉండి, వాటిలో 75 శాతం పెట్టుబడులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం ప్రణాళికలు ఎంచుకొన్న లక్ష్యాలను అందుకోలేకపోవడానికి కారణమైంది. భౌతిక, సాంఘిక అవస్థాపనా సౌకర్యాల కొరత, ప్రజలు ఉత్పాదక ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనే విధంగా వారిలో శిక్షణ, నైపుణ్యం పెంపొందించడానికి అవసరమైన ప్రభుత్వరంగ పెట్టుబడులను అందించడంలో ప్రణాళికలు విఫలమయ్యాయి. కొన్ని విధాలైన ప్రభుత్వ సేవలు అందించడానికే ప్రభుత్వ పెట్టుబడులు పరిమితమయ్యాయి. రాజకీయ కారణాల వల్ల ప్రాంతీయ అసమానతలు, ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి అవసరమైన అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టలేకపోయారు. రాబోయే ప్రణాళికలకు అతికొద్ది సరళత మాత్రమే మిగిలింది. ప్రణాళికా యంత్రాంగం మనదేశంలో బడ్జెట్‌లలో బహుళరంగ నమూనా అవలంభిస్తుంది. దీనివల్ల ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల మధ్య అగాధం పెరిగి, అవస్థాపనా సౌకర్యాలు, ప్రభుత్వ సేవలు సుదూరమవటమే గాక, ప్రభుత్వ వ్యయంలో అనేక అవరోధాలు ఏర్పడ్డాయి. ప్రణాళికా సంఘం ముఖ్యమంత్రులతో పాటు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. ఫెడరల్ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాష్ట్రాల వనరులు, ప్రజల అవసరాలకనుగుణంగా వ్యయ ప్రాధాన్యతలు నిర్ణయించుకోవాలి.

పెట్టుబడుల ఆకర్షణకు యత్నాలు..

మార్కెట్ ప్రణాళికలలో భాగంగా ప్రైవేటు రంగానికి పెద్దపీట వేసి, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి అనుగుణంగా పన్నులు, లైసెన్సింగ్, విదేశీ వ్యాపార విధానాలలో నిబంధనలు, నియంత్రణ తొలగించడం. ప్రభుత్వ పాలనా విధానాన్ని సరళీకృతం చేసి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, బహుళజాతి సంస్థలనాకర్షించడం లాంటి మార్పులు చేపట్టారు. ఈ మార్పులు దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులు పెంచి ఆధునికీకరణ ద్వారా గరిష్ట ఆర్థికాభివృద్ధి, ఉద్యోగితా విస్తరణ సాధించగలమని భావించారు. ఆర్థిక స్థోమత కేంద్రీకరణ నివారణ కోసం 1969లో MRTP చట్టాన్ని రూపొందించగా సంస్కరణల నేపథ్యంలో ఏ ఉద్దేశంతో ఈ చట్టాన్ని రూపొందించారో ఆ ఉద్దేశాన్ని MRTP చట్టం పరిధి నుంచి తొలగించారు. ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, మౌలిక సౌకర్యాలపై ప్రైవేటు పెట్టుబడుల ప్రోత్సాహం లాంటి అంశాలు మార్కెట్ శక్తుల ప్రాధాన్యతను తెలుపుతున్నాయి.

సామాజిక న్యాయంతో కూడిన వృద్ధి, ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి, ఆర్థిక స్థోమత కేంద్రీకరణ నివారణ, మౌలిక సౌకర్యాల అభివృద్ధికి మార్కెట్ వ్యవస్థల్లోను ప్రణాళికా రచనలో ప్రభుత్వ రంగ అవసరం ఉంది. ప్రైవేటు రంగ సంస్థల అభివృద్ధికి ప్రభుత్వ రంగ సంస్థలు నుంచి పోటీ లేకుండా ఉండే ధరల విధానాన్ని సృష్టించడం, ప్రైవేటు సంస్థల ఉత్పత్తులకు మార్కెట్ సృష్టించడం లాంటి విధానాలకు కూడా మార్కెట్ ప్రణాళికలలో ప్రణాళిక సంఘం ప్రాధాన్యమిచ్చింది. 1992 ఏప్రిల్ 1 నుంచి 2007 మార్చి 31 వరకు అమలులో ఉన్న వివిధ ప్రణాళికలలో వ్యవసాయ రంగం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల సౌకర్యాల విస్తరణకు పబ్లిక్ రంగ పెట్టబడులు తగ్గడంతో పాటు గ్రామీణ మౌలిక సౌకర్యాల అభివృద్ధికి చేసిన కేటాయింపులు తగ్గాయి.

ఆర్థిక వృద్ధిరేటు అధికంగా ఉన్నప్పటికీ భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాంఘిక భద్రతకు, శ్రామిక సంక్షేమానికి అవకాశం తక్కువ. ఈ దేశాల్లో అసంఘటిత రంగంలో శ్రామికులు ఎక్కువగా ఉండటంతో వారి కనీస అవసరాలు కూడా తీరడం లేదు. ప్రణాళికా యుగంలో ఉక్కు, సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం, పరిమాణం గణనీయంగా పెరిగినప్పటికీ ఈ ఉత్పత్తులకు సంబంధించిన సంస్థలు ఒక గ్రూప్‌గా ఏర్పడి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నందు వల్ల ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ శక్తులు అనుకూల వాతావరణం సృష్టించడంలో విఫలమయ్యాయని భావించవచ్చు. విద్యుత్, బొగ్గు, పెట్రోల్ ఉత్పత్తులో మార్పు కనిపించలేదు. అవస్థాపన సౌకర్యాలపై పెట్టుబడులు తగ్గాయి. మరోవైపు ప్రైవేటు రంగంలో దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించలేకపోయాం. 1991 తర్వాత రాష్ట్రాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు పెరిగాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఆర్థిక, సాంఘిక అవస్థాపనాభివృద్ధి జరిగి ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగాయి. దేశంలో పేదరికం, నిరుద్యోగం, తాగునీరు, పౌష్టికాహార లోపం లాంటి సమస్యలు పెరిగాయి. బడుగు వర్గాల జీవన ప్రమాణం తగ్గింది.

బడుగు వర్గాలను ఆదుకోవాలి...

నూతనంగా పారిశ్రామికీకరణ పొందిన దేశాలు కూడా తమ పారిశ్రామికీకరణ ప్రభుత్వ జోక్యం ద్వారానే సాధ్యమయిందని భావిస్తున్నాయి. మన దేశంలో డీబ్యూరోక్రటైజేషన్‌కు తక్కువ ప్రాధాన్యమిస్తూ.. సరళీకరణ అనే పేరుతో మార్కెటీకరణకు ప్రాధాన్యమివ్వడం మన విధానాల్లో పెద్ద లోపమని సి.హెచ్. హనుమంతరావు అభిప్రాయపడ్డారు. దిగుమతుల సరళీకరణ, పన్నుభారాన్ని తగ్గించడం ఫలితంగా చెల్లింపుల శేషంలో సంక్షోభం, కోశలోటు ఏర్పడింది. మరోవైపు ఇదేకాలంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో యాజమాన్య ప్రక్రియలో డీబ్యూరోక్రటైజేషన్ ద్వారా వాటి సామర్థ్యం పెంపుదలకు చేసిన కృషి తక్కువని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రణాళికా యుగంలో ఆర్థిక సమానత్వం, ఆర్థికవృద్ధి, సాంఘిక న్యాయం సాధించడానికి మార్కెట్ యంత్రాంగం తోడ్పడాలి. ఉపాధి విస్తరణ ద్వారా పేదరిక నిర్మూలన, జననాణ్యత మెరుగుపరచడానికి కృషిచేయాలి. 'ప్రపంచంలో ఒకవైపు సాంకేతిక నిపుణులతో మరోవైపు గరిష్టంగా నిరక్షరాస్యత, పేదరికం, తాగు నీరు, పౌష్టికాహార లోపం సమస్యలు ఎక్కువైనందు వల్ల బడుగు వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచవలసిన బాధ్యత ప్రభుత్వానిది'అని మాజీ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ అభిప్రాయపడ్డారు. ఏకస్వామ్యాల విషయంలో మార్కెట్ వైఫల్యమవుతున్నందు వల్ల వాటిని నియంత్రించే చట్టాలు రూపొందించి, మార్కెట్‌లో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. విద్య, ఆరోగ్యం లాంటి పబ్లిక్ వస్తువుల విషయంలో మార్కెట్ వైఫల్యం గమనించినందువల్ల సమాజంలో బలహీనవర్గాలను ఆదుకోవడానికి వీటి విషయంలో ప్రభుత్వ జోక్యం అవసరం. ఆర్థిక అవస్థాపనలైన నీటిపారుదల, రోడ్లు, రైల్వేల విషయంలో మార్కెట్ వైఫల్యం ఉన్నందువల్ల వీటిలో ప్రభుత్వ రంగ పెట్టుబడులు పెంచి తద్వారా ప్రైవేటు రంగ ప్రత్యక్ష పెట్టుబడులు వివిధ ప్రధాన రంగాల్లో చోటు చేసుకునే విధంగా ఆ రంగాన్ని ప్రోత్సహిస్తూ ప్రణాళికా రచనకు విధాన నిర్ణేతలు ప్రయత్నించాలి.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1.ప్రైవేటీకరణ పదాన్ని మొదట ఉపయోగించింది?

ఎ) జె.బి. క్లార్క్ బి) పీటర్ డ్రకర్

సి) ఫిషర్ డి) మార్షల్

2.సూచనాత్మక ప్రణాళికా భావన ఏ ప్రణాళికలో ప్రవేశపెట్టారు?

ఎ) 8వ బి) 9వ సి) 10వ డి) 11వ

3.ప్రస్తుతం తప్పనిసరిగా లైసెన్స్ కావలసిన పరిశ్రమలు?

ఎ) 10 బి) 8 సి) 7 డి) 5

4.ఎంఆర్‌టీపీ చట్టం స్థానంలో ప్రవేశపెట్టినవి?

ఎ) పన్నులు బి) పన్నేతర ఆంక్షలు

సి) పోటీ చట్టాలు డి) పెట్టుబడి పరిమితి

5.సాంఘిక న్యాయంతో కూడిన వృద్ధి ఏ ప్రణాళిక లక్ష్యం?

ఎ) 7 బి) 8 సి) 9 డి) 10

6.కింది ఏది నూతన ఆర్థిక విధానం లక్ష్యం కాదు?

ఎ) ఉపాధి విస్తరణ బి) ఆర్థిక వృద్ధి సాధించటం

సి) ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి

డి) విదేశీ పెట్టుబడులపై ఆంక్షలు

7.నేషనల్ డెవలప్‌మెంట్ అండ్ రిఫామ్ కమిషన్‌ను చైనా ఎప్పుడు ఏర్పాటు చేసింది?

ఎ) 1998 బి) 2000 సి) 2001 డి) 2008

8.దేశంలో మూలధన మార్కెట్‌ను నియంత్రించేది?

ఎ) IDBI బి) SEBI

సి) RBI డి)NABARD

9.వాణిజ్య బ్యాంకులు తమ వడ్డీరేట్లను ఏ విధంగా నిర్ణయించుకొంటాయి?

ఎ) ఆర్‌బీఐ ప్రకారం బి) మార్కెట్ శక్తుల సహాయంతో

సి) నాబార్డ్ ప్రకారం డి) ఎస్‌ఈబీఐ సూచన

జవాబులు	1	2	3	4	5	6	7	8	9
	B	A	D	C	C	D	A	B	B